

# అమ్మో దెయ్యం!

## కె. తాయారమ్మ

**"నిజంగా దెయ్యాలుంటాయా తాతయ్యా?" చాలా ఏళ్ళు మహారాష్ట్రలో వుండి వచ్చిన కార్తికేయ ప్రశ్నించాడు!**

**వెంకన్న తాత నవ్వాడు! "ఉంటాయిరా అబ్బీ! అందులో మంచి దెయ్యాలూ వుంటాయి చెడ్డ దెయ్యాలూ వుంటాయి!"**

"అసలు దెయ్యాలంటేనే చెడ్డవి అన్న అర్థం కదా! ఇంక అందులో మంచి చెడ్డలకి తావెక్కడ" కార్తికేయ మరో ప్రశ్న సంధించాడు.

"రెండు రకాలూ వుంటాయిరా! ఓ సారి మా నాన్న సింహాచలం నించి పద్మనాభం నడిచిపోతున్నాడట! అప్పుడు అర్థరాత్రి! ప్రయాణసాధనాలు లేవు! కీచురాళ్ళ ధ్వని భయం గొల్పుతోందట! గుండె చేతపట్టుకుని నడుస్తున్నాడట! ఇంతలో ఓ ముసలాడు "బాబు మీరు ఏడకెళ్ళాలి! నేను తోడు వస్తాను! అంటూ ఆయన్ని గమ్యం చేర్చాడట!"

"కృతజ్ఞతలు చెప్పడానికి మా నాన్న వెనుదిరిగి చూస్తే ఎవరూ లేరట! తరువాత తెలుసుకున్నాడట తనకు సాయం వచ్చిన వ్యక్తి మనిషి కాదని, దెయ్యం! అని".

"తాతయ్యా ఏద్దైనా కథ చెప్పవూ!" అన్నాడు కార్తికేయ.


"చెప్తానురా అబ్బీ దెయ్యం కథే చెప్తాను!" గట్టిగా ఊపిరి పీల్చుకుని ఓ పొడుం పట్టు పీల్చి, ఆకాశంవైపు, చుక్కలవైపు చూస్తూ, ఏదో ఆలోచిస్తూ వేళ్ళు లెక్కిస్తూ తెగ గందరగోళం పడుతున్న వెంకన్న తాత పక్కనే వచ్చి కూచుంటూ "ఆ కథేదో చెప్పొచ్చుగా! ఏవిటా కంగారు?" అంది ఆయన భార్య లచ్చవ్వ!.

"చెబుతాలే ఇల్లారా! ఇంతసేపు నువ్వు లేవనే ఆగిపోయాను!" అన్నాడు వెంకన్నతాత భార్యవైపు కొంటెగా చూస్తూ.

"ఈయనగారికి పైత్యం బాగా ముదిరింది! "అని గొణిగింది లచ్చవ్వ.

కథ ప్రారంభించారు వెంకన్నతాత.

వెంకటకృష్ణయ్యగారు పరుగెడుతున్నారు. ఆయాసంతో రొప్పుతున్నారు! భయంతాలూకు నీడలు ఆయన ముఖంలో స్పష్టంగా కనుపిస్తున్నాయి! పంచె ఊడి ఆయన కాళ్ళకి అడ్డంపడుతోంది! ఆయన చెవులకి వున్న బంగారు కుండ




లాలు వింతగా కదులుతున్నాయి. స్వేదంతో తడిసిన నుదుటిబొట్టు ముక్కు మీదుగా ప్రవహిస్తూంది, ఎర్రని రంగులో.

ఎప్పుడూ జడుపు తెలియని, భయం ఎరగని వెంకటకృష్ణయ్య గారు అలా పరుగెత్తుతూ వుంటే వీధి అంతా ఆశ్చర్యంగా చూస్తోంది!

''ఈయనకేమయ్యింది?'' అందరిలో తలెత్తిన ప్రశ్న ఇదే!

అర్ధరాత్రి ఊరికి చాలా దూరంలో వున్న జువ్వి చెట్టు దగ్గర కెళ్ళమన్నా, పెద్ద పెద్ద ఊడలతో విస్తరించి, జడలదెయ్యంలా వున్న మర్రిచెట్టు కింద నిలబడమన్నా, చిక్కగా అల్లుకున్న చింతతోపులోకి ప్రవేశించమన్నా భయం చెందని ఆయన ఈనాడు ఇలా....?

జీవితం చిత్రంగా వుంటుంది!

వెంకటకృష్ణయ్యగారు ఆ ఊరు వచ్చి సంవత్సరం కావస్తోంది. దుర్గగుడి అధికారిగా, శిధిలావస్థలో వున్న ఆలయ నిర్మాణ సారథిగా ఉద్యోగరీత్యా వచ్చారు.

వెంకటకృష్ణయ్యగారికి నలభై అయిదేళ్ళుంటాయి. ఒక్క కూతురు పెళ్లి చేసి అత్తవారింటికి పంపేరు. కొడుకులిద్దరు. ఒకళ్ళు మెడిసిన్, ఇంకొకళ్ళు ఇంజనీరింగు చదువుతున్నారు పట్నంలో. సెలవులకి వచ్చి వెళ్తూ వుంటారు.

వెంకటకృష్ణయ్యగారు ఊళ్ళు తిరుగుతూ వుంటారు ఉద్యోగరీత్యా. శ్రీరామ చంద్రుడయినా, వేణుగోపాలుడయినా, సదాశివుడయినా, దుర్గమ్మ తల్లి అయినా ఆయనకి ఒకటే?!

ఆయన భార్య మహాలక్ష్మి నోరు దురుసు మనిషి. అయినా మనసు మంచిదే! పుట్టింటివాళ్లు ఇంత కలిగిన వాళ్ళని ఆవిడకి గర్వం. ఆడపిల్ల పెళ్ళి, మగపిల్లల చదువులు, అన్నీ పుట్టింటివాళ్ళే చూస్తున్నారు.

దుర్గాపురం భార్యతో సహా వచ్చారు వెంకటకృష్ణయ్యగారు. ఆ ఊళ్ళో ఇల్లు దొరకడం దుర్లభమయ్యింది. దేవస్థానం ఇల్లు శిథిలావస్థలో వుంది! పల్లెటూళ్ళలో ఇళ్ళు సులువుగా దొరుకుతాయంటారు! కాని... ఇదేం చోద్యం? ఎక్కడా ఇల్లు కుదరలేదు.

గ్రామ సర్పంచి రాఘవయ్యగార్ని కలిశారు! ఊరిమధ్యలోనే ఇల్లు దొరికింది.

ఆరోజే భార్యతో సహా ఆ ఇంట్లో ప్రవేశించారు వెంకటకృష్ణయ్యగారు.

''అయ్యో! ఆ ఇంట్లో దిగారా? అది దెయ్యాల కొంపండీ! ఎవ్వరూ ఒక్క వారం రోజులు కూడా వుండలేదు!'' అన్నాడు ఆ ఊరిలో ఓ పెద్దమనిషి.

''ఆ దెయ్యాలు మనల్ని ఏం చేస్తాయండీ? మనం దెయ్యాలం'' అంటూ కొట్టిపారేశారు వెంకటకృష్ణయ్యగారు నవ్వుతూ.

''మా పిన్నత్తగారి కొడుకు కోడలు ఆ ఇంట్లో కొన్నాళ్ళు వున్నారు. కడుపుతో వున్న ఆ పిల్ల కడుపులోని బిడ్డని దెయ్యం తినేసింది! మీరెలా వుంటారో ఏమో?'' అంటూ మహాలక్ష్మి దగ్గరే ఓ మహిళామణి అన్నది.

మహాలక్ష్మి గుండె ఝల్లుమంది! అయినా తమాయించుకుని అంది. ''మా వారు భూత వైద్యం చేస్తారు! ఎవరికైనా భూతంకాని, దెయ్యం కాని పడితే క్షణాలలో వదిలిస్తారు!

అదిగో చూడండి ఆ చేతికి వుండే బంగారు కడియం, అది ఇదివరకు మేం వుండే ఊళ్ళో బంగారు సెట్టిగారి పడుచు భార్యకి పట్టిన దెయ్యాన్ని వదిలించినందుకు ఆయన వేశాడు! ఇంకా మావారు పాము మంత్రాలు వేస్తారు! తాయెత్తులు కడతారు! జపాలు చేస్తారు! ఇంకా ఎన్నో'' అంటూ మహాలక్ష్మి నొక్కి వక్కాణించింది ఊరి ఆడంగులకి!

ఊరంతా గుప్పుమంది వెంకటకృష్ణయ్యగారికి మంత్రతంత్రాలు వచ్చని, మహిమలెన్నో వున్నాయని!

అది మొదలు అందరూ రావడం మొదలు పెట్టారు వెంకటకృష్ణయ్యగారి దగ్గరకి.

''మా పిన్నత్త గారి మేనల్లుడికి ఆడ దెయ్యం పట్టుకుందంటే, మా తమ్ముడి ఇంటికెవరో చిల్లంగి పెట్టారు బాబూ! అంటూ మరొకరు...'' ఈ విధంగా నిలదొక్కుకున్నారాయన ఆ ఊళ్ళో.

మహాలక్ష్మికి మాత్రం ఆయన మీద కోపంగానే వుంది. దెయ్యాల కొంపలో తనని తెచ్చిపడేసినందుకు పదిసార్లు విరుచుకుపడింది.

''అసలు దెయ్యం ఎక్కడ వుంది.''

ఆ ఇంటి యజమాని పడుచు భార్య నూతిలో పడి మరణించిందని, కోరికలు తీరక ఆమె దెయ్యం అయిందని, పూజారి గురులింగం భార్య రుద్రమ్మ చెప్పింది.

ఇవన్నీ భర్తతో చెప్తే ''పిచ్చిదానా నిజంగా ఆ దెయ్యమే కాని కనిపిస్తే మారణ హోమం చెయ్యనూ! నువ్వు నిర్భయంగా వుండు!'' అంటూ ధైర్యం చెప్పాడు.

అప్పటికి ఊరుకుంది మహాలక్ష్మి.

ఆరోజు వెంకటకృష్ణయ్యగారు వీధి వసారాలో నవారు మంచం వాల్చుకుని కూర్చుని వుండగా ఓ ముప్పై ఏళ్ళ యువకుడ్ని మోసుకువచ్చారు నలుగురైదుగురు వ్యక్తులు. అతగాడు నురగలు కక్కుతున్నాడు. త్రాచుపాము కరిచిందిట! వెంటనే మంత్రం వేశారు వెంకటకృష్ణయ్యగారు. పాముమణిని తెప్పించి కరిచినచోట అంటించి కట్టుకట్టారు!

అతగాడు బ్రతికాడు.

వెంకటకృష్ణయ్యగారి పేరు నలుదిక్కులా వ్యాపించింది. ఒంటరిగా వుంది మహాలక్ష్మి. నలభై ఏళ్ళ మహాలక్ష్మికి ఇంతవరకూ ఏ దిగులూ, భయము లేవు! కాని...కాని.... ఈ... ఇల్లే అంతులేని భయాన్ని కలిగిస్తోంది.

వెంకట కృష్ణయ్యగారు ఊరువెళ్ళారు. ఆ రాత్రి రుద్రమ్మని సాయం పడుకోబెట్టుకుంది మహాలక్ష్మి. అర్ధరాత్రి గాజుల గలగలలు, గజ్జెల చప్పుళ్ళు, చిన్న చిన్న నవ్వులూ అన్నీ వినిపించాయి. గుండె మీద చెయ్యి వేసుకుంది భయంతో.

ఆ రాత్రి శివరాత్రే అయ్యింది మహాలక్ష్మికి.

ఉదయం నిద్ర లేచి ఈ విషయం అంతా రుద్రమ్మతో చెప్పింది.

''మరెప్పుడూ రాను తల్లీ! నువ్వే మా ఇంటికి రా!'' అంటూ పారిపోయింది రుద్రమ్మ.

ఆ మరునాడు వచ్చేరు వెంకట కృష్ణయ్యగారు. ఆయన ముఖం, శరీరం నల్లగా వున్నాయి. వస్తూనే చెప్పారాయన ఏదో పల్లెటూళ్ళో సత్రంలో విడిదిచేశారని, అర్ధరాత్రి నాగుపాము కరిచిందని, ఒళ్ళంతా తిమ్మిరెక్కుతూ వుంటే తనకు తానే మంత్రం రాజుకున్నానని చెప్పారు ఆయన.

''అమ్మో ఎంత పని జరిగింది?'' అంది మహాలక్ష్మి.

రాత్రి తనకు జరిగిన అనుభవాన్ని కూడా చెప్పింది మహాలక్ష్మి.

''అదంతా నీ భ్రమ!'' అని తోసి పుచ్చారు వెంకటకృష్ణయ్యగారు. దానితో ఒళ్ళు మండింది మహాలక్ష్మికి.

రోజులు దొర్లిపోతున్నాయి.

పెదకామందు నరసప్పయ్యగారి రెండవ కూతురు తన బిడ్డకి దొరసాని దెయ్యం పడితే దానికి వెంకటకృష్ణయ్యగారు విడిపించారన్న కృతజ్ఞతతో, ఆయనకి ఘనసన్మానం జరిపించి, నవరత్నాలు

పొదిగిన ఉంగరాన్ని బహూకరించారు.

దీనితో ఆయన కీర్తి ఇంకా పెరిగింది.

వెంకటకృష్ణయ్యగారికి ఇదంతా దుర్గమ్మ తల్లే కలిగించిందని గుడికెళ్ళి ఆ తల్లికి సాష్టాంగ దండప్రణామం ఆచరించాడు.

వేయి నాల్కలతో భయపెట్టే దేవత, ప్రశాంత సుందరవదనంతో సాక్షాత్కరించినట్లనిపించింది. ఆ చిరుదరహాసం ముందు మరోసారి ఆ దేవత ముందు మోకరిల్లాడాయన.

ఆ రోజు మధ్యాహ్నం పన్నెండు గంటలవేళ భోజనం చేసి ఎవరితోనో మాట్లాడుతున్నాడు వెంకటకృష్ణయ్యగారు. ఇంతలో కరణంగారి మేనకోడలు వెంకు వచ్చి ''అత్తయ్యగారూ అలా వెళ్దాం రండి!'' అంటూ లాక్కుపోయింది మహాలక్ష్మిని.

ఆ అమ్మాయి వెంట వెళ్ళింది మహాలక్ష్మి. ఆ అమ్మాయి అలా అలా ఎంతో దూరం తీసుకెళ్ళి, శ్మశానాల దగ్గర మహాలక్ష్మిని వదిలి వికటాట్టహాసం చేస్తూ పారిపోయింది.

మహాలక్ష్మికి ముచ్చెమటలు పోశాయి.

దారితెన్నూ తెలియలేదు.

భయంతో కాళ్ళు వణుకుతున్నాయి. ఎలా వచ్చి పడిందో ఇంటికి వస్తూనే భర్తమీద విరుచుకు పడింది. ''నేను చస్తే ఒక్క క్షణం కూడా ఈ ఇంట్లో వుండను. ఈ దెయ్యాలకొంప వద్దంటే విన్నారు కాదు. మీ మంత్రాలు, తంత్రాలు ఇక్కడ పని చెయ్యడం లేదు. మొన్నటికి మొన్న ఎర్రచీర కట్టుకున్న స్త్రీ పెరట్లో కుంకుడుచెట్టుకింద నిలబడిందంటే నమ్మలేదు మీరు. అదంతా నీ భ్రాంతి మహాలక్ష్మి అంటూ కొట్టి పారేశారు. ఇప్పుడేమంటారు?''

ఈ మాటలన్నీ ఆసక్తిగా విన్న వెంకటకృష్ణయ్యగారు అన్నారు. ''మహాలక్ష్మి, ఆ దెయ్యాన్ని మారణ హోమం చేస్తాను నువ్వు భయపడకు'' అని.

''మీరు ఏం చేస్తారో నాకు తెలియదు. నేను మా పుట్టింటికి వెళ్ళిపోతున్నాను''. పెట్టెబేడా సర్దుకుని రైలెక్కింది మహాలక్ష్మి. మహాలక్ష్మి లేని ఇంట్లో వుండడం కష్టంగా వుంది. వెంకటకృష్ణయ్యగారికి. పూజారిగారింట్లో భోజనం చేస్తున్నారు.

ఏ రోజూ ఆ ఇంట్లో ఏ దెయ్యం కనిపించలేదు వెంకటకృష్ణయ్యగారికి. మహాలక్ష్మిని ఏడిపించడానికి వెంకు అలా చేసి వుంటుంది.

మహాలక్ష్మి పుట్టింటికెళ్ళి మూడు నెలలు దాటింది.

''కోపం తగ్గితే ఆమే వస్తుందిలే'' అని సరిపెట్టుకున్నారు వెంకటకృష్ణయ్యగారు.

ఆ రోజు ఉత్తరం వచ్చింది మహాలక్ష్మి నుంచి రేపు వస్తున్నానని. గుండెలనిండా ఊపిరిపీల్చుకున్నారు వెంకటకృష్ణయ్యగారు.

సాయంత్రం ఏడుగంటల వేళ కోనేటికి స్నానానికి వెళ్ళి వచ్చేసరికి ఇంటినిండా లైట్లు వెలుగుతూ కనిపించాయి.

''ఎవరై వుంటారు?'' అనుకుంటూ ఇంట్లోకి అడుగుపెట్టిన ఆయనకి నవ్వుతూ మహాలక్ష్మి ఎదురు వచ్చింది.

''మహాలక్ష్మి, రేపు వస్తానన్నావుగా?''

''నాన్నగారు ఈరోజు బావుందన్నారు. అందుకే ముందుగా వచ్చాను'' అంది మహాలక్ష్మి.

''మంచి పని చేశావు!'' అంతరంగంలో సంతృప్తి చోటు చేసుకుంది.

ఆ రాత్రి మహాలక్ష్మి పుట్టింటినించి తెచ్చిన, ఆవు నేతితో చేసిన సున్నుండలు, పాలకోవా తిన్నారు. జున్ను తిన్నారు. ''వీటిలో నీ ప్రేమ రంగరించి పోశావు మహాలక్ష్మి. అందుకే ఇంత బాగున్నాయి'' అన్నారు వెంకటకృష్ణయ్యగారు.

నవ్వింది మహాలక్ష్మి.

చాలా రోజుల తరువాత మహాలక్ష్మి తమలపాకులు అందిస్తూ వుంటే తనంత అదృష్టవంతుడు వుండడనుకున్నారు వెంకటకృష్ణయ్యగారు.

ఆ రాత్రి ఆనందకరంగా గడిచింది.

మరునాడు ఉదయం ఆయన వీధి వరండాలో ఈజీ ఛైర్లో కూచుని ఎవరితోనో మాట్లాడుతున్నారు. లోపల ఏవేవో శబ్దాలు వినిపిస్తున్నాయి. మహాలక్ష్మి వంట చేస్తున్నట్లున్నది.

ఇంతలో వీధి గుర్రపు బండి ఆగింది.

అటువైపు చూశారు వెంకటకృష్ణయ్యగారు.

బండిలోంచి మహాలక్ష్మి దిగింది ''నేను వస్తున్నట్లు ముందే ఉత్తరం రాశానుకదా! స్టేషన్‌కి బండి పంపలేదేం? మతిమరుపా? నిర్లక్ష్యమా?'' విరుచుకుపడింది.

''అయితే క్రితం రాత్రి వచ్చినది ఎవరు?'' మరి ఆలోచించలేకపోయారు. ఒక్క ఉదుటున వీధిలోకి పరుగెత్తారు – శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయం అనుకుంటూ.

''అయితే తాతా, వెంకటకృష్ణయ్య గారు దెయ్యాన్ని మారణ హోమం చేస్తారని చెప్పేవు కదా! మరెందుకాయన పారిపోయారు?'' కార్తికేయ ప్రశ్నించాడు.

''ఔనా అబ్బీ! కాని కొన్ని మొండి దెయ్యాలు కూడా వుంటాయి! వాటిని ఏమీ చెయ్యలేము''.

''మొండి దెయ్యాలా?'' మరోసారి ఆశ్చర్య పోయాడు కార్తికేయ.

''చాల్లెండి, ఇంకెళ్ళి నిద్రపోండి. చెప్పిన కథ చాలు'' అంటూ కసురుకుంది లచ్చవ్వ.

నెమ్మదిగా లోపలికి నడిచాడు వెంకన్న తాత ''ఒరే అబ్బీ నిద్ర పోతానురా'' అంటూ.

కార్తికేయ లేవబోయాడు ''ఉండ్రా అబ్బీ, మిగిలిన కథ నేను చెప్తాను'' అంది లచ్చవ్వ.

''కథ పూర్తికాలేదా?'' అంటూ మళ్ళీ కూలబడ్డాడు కార్తికేయ.

''పూర్తికాలేదు'' అని గంభీరంగా పలికి, భర్త దెయ్యాల పిచ్చి ఎలా వదలకొట్టాలా? అని ఆలోచించిన మహాలక్ష్మి ఓ పథకం వేసింది. తొలినాటి రాత్రి వచ్చినది నిజంగా మహాలక్ష్మే అయితే మరునాడు పొద్దున్న వెంకటకృష్ణయ్యగారు వీధిలో ఎవరితోనో మాట్లాడుతున్నప్పుడు, మహాలక్ష్మి పెరటి దారిగుండా స్టేషన్ కెళ్ళి, గుర్రపుబండి కట్టించుకుని వచ్చి వీధివాకిట్లో దిగింది.

''అంతే, ఆయన భయంతో పరుగెత్తారు''.

''అయితే దెయ్యాలు లేవంటావా లచ్చవ్వా?''

''లేవురా అబ్బీ! ఇక నువ్వు కూడా నిద్రపో'' అంది లచ్చవ్వ.

ఇప్పటికీ దెయ్యాలంటే హడలిపోతూ వుంటారు వెంకటకృష్ణయ్యగారు. మంత్రాలు, తంత్రాలూ అన్నీ వదిలేశారు. రాత్రి ఎవరిసాయం లేకుండా వీధిలోకి కూడా అడుగుపెట్టడం లేదు.

''అలాగా?'' అన్నాడు కార్తికేయ ఏదో ఆలోచిస్తూ.

''ఇంతకీ ఆయన వున్నారా ఇప్పుడు?''

''ఎందుకు లేరూ? ఇంత సేపూ నీకు కథ చెప్పాడే వెంకన్న తాత ఆయనే వెంకటకృష్ణయ్యగారు''.

''మరి ఆయన భార్య?''

''ఆ మహాలక్ష్మిని నేనే'' అంటూ ముసిముసిగా నవ్వుకుంటూ లోపలికి నడిచింది లచ్చవ్వ.

చేష్టలు దక్కి చూస్తూ వుండిపోయాడు కార్తికేయ.

